కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, చిన్న వ్యాపారులు

ఆస్పరి సొసైటీలో అక్రమాలు...

• బినామీల పేర్లతో రుణాలు • పేరుకుపోయిన పారుబకాయిలు

ప్రజాశక్తి - ఆస్పరి

సహకార సంఘాలు స్వతంత్రంగా ఆర్థికంగా బలపడాలని కెడిసిసి బ్యాంకు యాజమాన్యం ఇచ్చిన స్వేచ్ఛను ఆస్పరి సొసైటీ పాలకవర్గం చక్కగా వినియోగించుకొని చేతి వాటం ప్రదర్శించారు. లక్షల్లో దోచుకున్నారు...

ఆస్పరి సొసైటీ 2013లో 43 లక్షల రుణాలు మంజూరులో దాదాపుగా 10 లక్షలకుపైగానే సొసైటీ పాలక వర్గానికి చేతివాటం కింద అందినట్లు బలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుణాల మంజూరు పారదర్శకంగా జరగకపోవడంతో దాదాపు 20 లక్షలకు పైగానే పారు బకాయిలుగా మారి సొసైటీ ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. ఇచ్చిన రుణాలలో 50 శాతం పారు బకాయిలుగా మారింది. సొసైటీ ప్రతిరోజు వ్యాపారస్తుల ద్వారా రోజు పిగ్మీ కలెక్షన్ చేసేది. ఇలా దాదాపు 40 లక్షలకు పైగానే వసూలు చేసిన డబ్బుతో వ్యాపారాలకు వ్యక్తిగత రుణాలు, స్కూటర్ లోన్లు ఇచ్చారు. వ్యాపారస్తుల ద్వారా రోజువారి వసూలు చేసి డబ్బుకు తక్కువ వడ్డీ ఇస్తూ రుణాలకు ఎక్కువ వడ్డీలు వసూలు చేసి సొసైటీకి ఆర్థికంగా చేయూత అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 110 మందికి 10 వేల నుంచి 50 వేల వరకు

ఆస్పరి సొసైటీ కార్యాలయం

వ్యక్తిగత రుణాలు ఇచ్చారు. 56 మందికి మోటార్ సైకిల్ కొనేందుకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రుణాలు ఇచ్చారు. రుణాలు తీసుకున్న వారిలో దాదాపుగా చాలామంది తిరిగి చెల్లించక పోవడంతో 20 లక్షలకు పైగానే రుణాలు మిగిలి పోయాయి. సొసైటీ పాలక వర్గంలో చాలా మంది తమ బంధువులు, కుటుంబ సభ్యులతో పాటు బినామీ పేర్ల పై రుణాలు పొందినట్లు తెలుస్తుంది.

పారదర్శకంగా జరగని డాక్యుమెంటేషన్

రుణాల మంజూరుకు సంబంధించిన డాక్యుమెంటేషన్ నామమాత్రంగా నిర్వహించారు. రుణ దరఖాస్తు, రుణ హామీ పత్రంలోను పంపిణీ రిపోర్ట్ మాత్రమే పూర్తి చేశారు. రుణ హామీ పత్రంలో నామకేవాస్తుగా రుణాలు పొందిన వారి ఆస్తి వివరాలను మాత్రమే పొందుపరిచారు. ఆస్తికి సంబంధించిన ఎలాంటి డాక్యుమెంటేషన్ పేపర్లను తీసుకోలేదు. సాధారణంగా కమర్షియల్ బ్యాంకుల్లో రుణాలు పొందాలంటే ఎన్నో రకాల నిబంధనలు ఉంటాయి. పారదర్శకంగా డాక్యుమెంటేషన్ లేకపోవడంతో సొసైటీ అధికారులకు రుణాలు వసూలు చేయడంలో ఇబ్బందులు వస్తున్నాయి.

సమగ్ర విచారణ జరపాలి

- రంగస్వామి రైతు సంఘం మండల కార్యదర్శి

జిల్లా అధికారులు 2013 సంవత్సరంలో సొసైటీ పాలకవర్గం మంజూరు చేసిన రుణాలపై సమగ్ర విచారణ జరిపించాలి. సొసైటీకి సంబంధించి 20 లక్షలకు పైగా పారు బకాయిలుగా మారేందుకు కారణమైన పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలి. పాలకవర్గం కమిషన్లకు ఆశపడి పారదర్శకంగా రుణాలు మంజూరు చేసి సొసైటీలను ఆర్థికంగా నష్ట పరుస్తున్నారు.

చిన్న వ్యాపారుల కడుపు కొట్టొద్దు

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నిర్మల
- రోడ్డు సైడ్ చిన్న వ్యాపారుల ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలో చిన్న చిన్న వ్యాపారాలు రోడ్డు వైపు పెట్టుకొని జీవనం సాగిస్తున్న వారి ఉపాధికి గండి కొట్టొద్దని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.నిర్మల కర్నూలు కార్పొరేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధిలో వారి వ్యాపారాల అభివృద్ధికి ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట రోడ్డు సైడ్ చిన్న వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతకుముందు జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ అధ్యక్షులు డి.అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో నిర్మల, ఓల్డ్ సిటీ, న్యూ సిటీ ప్రధాన కార్యదర్శులు విజయ్, నరసింహులు మాట్లాడారు. మంత్రి, కలెక్టర్ ఆదేశానుసారం రోడ్ సైడ్ చిన్న వ్యాపారులను తొలగించాలని మున్సిపల్ అధికారులు పూనుకున్నారని తెలిపారు. చిన్న వ్యాపారులు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం, సహకారాలు అడగకుండా ప్రజలకు తక్కువ ధరలకు సరుకులు, వస్తువులను అమ్ముతూ జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటి వారిని తొలగించాలని పూనుకోవడం సరైంది కాదని తెలిపారు. చిన్న వ్యాపారులు ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో మున్సిపల్ అధికారుల వైఖరి మారకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆటో యూనియన్ నగర అధ్యక్షులు కుమార్, రోడ్ సైడ్ చిన్న వ్యాపారుల సంఘం అధ్యక్షులు ఇక్బాల్, శివ ప్రసాద్, ఉపాధ్యక్షులు రజనీకాంత్ రెడ్డి, గోరబాయి, ఇంతియాజ, సిఐటియు నాయకులు షరీఫ్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు తగ్గించాలి

- కేసుల ఛేదనకు టెక్నాలజీని వినియోగించాలి
- నేర సమీక్షలో ఎస్పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు గట్టిగా పని చేస్తూ పెండింగ్ కేసులు తగ్గించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి కేసు వివరాలను ఎప్పటికప్పుడు సిసిటిఎన్ఎస్‌లో నమోదు చేయాలన్నారు. గ్రేవ్ ప్రాపర్టీ కేసులు, హత్య కేసుల గురించి ఆరా తీశారు. కేసుల చేధనకు టెక్నాలజీ ఉపయోగించాలన్నారు. బేసిక్ పోలీసింగ్ పాటించాలన్నారు. జీరో ఎఫ్ఐఆర్, ఈఎఫ్ఐఆర్, ఈ-సాక్ష్య యాప్‌ను బాగా వినియోగించాలన్నారు. అర్హత ఉన్న కేసులను మాత్రమే లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే విధంగా ఉంచాలన్నారు. రౌడీ షీటర్స్ కదలికలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. కేసుల చేధనను వేగవంతం చేసేందుకు త్వరలో ప్రతి సబ్ డివిజన్‌ను ఒక డాగ్ స్క్వాడ్ టీం, జాగిలాలను, క్లూస్ టీంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళల పై జరిగే నేరాలను తీవ్రంగా పరిగణించాలన్నారు. 60 రోజులలోపు చార్జ్ షీట్ ధాఖలు చేయాలన్నారు. ప్రాముఖ్యత ఉన్న కేసులను డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు మానిటరింగ్ చేయాలన్నారు. నిందితులకు శిక్షలు పడేందుకు కృషి చేయాలన్నారు. ఈ నెల 29 నుండి అక్టోబర్ 26 వరకు 4 వారాలపాటు రోడ్డు భద్రతపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా నేషనల్ హైవే, స్టేట్ హైవేలలో రాంగ్ రూట్, రాంగ్ పార్కింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, నో హెల్మెట్ డ్రైవింగ్ చేసేవారిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. అనంతరం గత నెలలో వివిధ కేసుల్లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. లీగల్ అడ్వయిజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు బాబు ప్రసాద్, వెంక ట్రామయ్య, భార్గవి, సిఐలు, ఎస్సైలు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

విద్యుత్ ప్రమాదానికి గురైన
కార్మికునికి మెరుగైన వైద్యమందించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూల్ హాస్పిటల్

అనంతపురం జిల్లా హంపాపురం విద్యుత్ సబ్ స్టేషన్ 33 కెవి కరెంటు పనులు చేస్తూ కరెంటు షాక్‌కు గురైన బెంగాల్‌కు చెందిన కార్మికుడు షేక్ బైసికి మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు, నగర ప్రధాన కార్యదర్శి ఆర్ నరసింహులు, నగర అధ్యక్షులు వై నగేష్ డిమాండ్ చేశారు. కర్నూలు జిజిహెచ్ కాలిన రోగుల వార్డులో చికిత్స పొందుతున్న కార్మికుడినికి గురువారం వారు పరామర్శించారు. కాలిన రోగుల వార్డు డాక్టరు కృష్ణను పేషెంట్‌కు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. 33 కెవి ఫిట్టింగ్ పనులు చేస్తుండగా కరెంటు షాక్ కు గురై కుడికాలు మొత్తము నడుము వరకు కాలిపోయిందని, అనంతపురం జిల్లా హాస్పిటల్లో చేర్పించి అక్కడ నయం కాదని కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కాలిన రోగుల వార్డులో చేర్పించారని, రోగికి రక్తంలో ప్లేట్లెట్లు శాతం తక్కువగా ఉన్నాయని ఆపరేషన్ చేయటం లేటు అయినదని అన్నారు. కాంట్రాక్టర్ అల్లు గోపాల్ షేక్ బైసికి మెరుగైన వైద్యం అందించడంలో చాలా నిర్లక్ష్యం చేశారన్నారు. డాక్టర్‌ను రోగి షేక్ బై సి ఆరోగ్య పరిస్థితిని గురించి సిఐటియు నాయకులు అడిగి తెలుసుకునగా రోగి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని చెప్పారని, రోగికి మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని సిఐటియు నాయకులు డాక్టర్‌ను కోరారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

- తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన అవసరం - కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని, జిల్లాను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తెలిపారు. గురువారం 'స్వచ్ఛతా హీ సేవా'లో భాగంగా నగరంఒలని తుంగభద్ర నది, సంకల్ బాగ్ వద్ద పారిశుధ్య కార్మికులతో కలిసి చీపురు పట్టి, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'స్వచ్ఛతా హీ సేవా'లో భాగంగా 'ఏక్ దిన్, ఏక్ ఘంట, ఏక్ సాత్' నినాదంతో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని కోరారు. ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని తెలిపారు. చెత్తను కాలువల్లో, రోడ్ల పక్కన వేయకుండా ఇంటి వద్దకొచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల పర్యావరణ పరిరక్షణ, వ్యాధుల నివారణకు దోహదపడుతుందని తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్‌ను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ... పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించే సమయంలో కచ్చితంగా గ్లౌజ్‌లు, మాస్కులు ధరించాలని సూచించారు. పనిముట్లు ఇస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని ప్రజారోగ్య అధికారిని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్, ఎస్ఇ శేష సాయి, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

గుండె వ్యాధుల పట్ల అవగాహన అవసరం

కర్నూలు కలెక్టరేట్ : గుండె వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందాలని కలెక్టర్ డాక్టర్ ఎసిరి పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టర్ గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి అవసరమైన వ్యాయామం, దురలవాట్లకు దూరంగా ఉండడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో గుండె జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో గుండె ఆరోగ్యం పట్ల అవగాహన చాలా అవసరమని చెప్పారు. డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సిలర్, హార్ట్ ఫౌండేషన్ సెక్రటరీ డాక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ... ఈనెల 29న ప్రపంచ హృదయ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ పి.సిరాత్, సీనియర్ కార్డియాలజీ, అపోలో ఫార్మసీ, హైదరాబాద్ వారికి ఈఏడాది అవుట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును కర్నూలు హార్ట్ ఫౌండేషన్ తరపున అందజేస్తున్నట్లు చెప్పారు. హార్ట్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్లు కల్యూర చంద్రశేఖర్, డాక్టర్ భవాని ప్రసాద్, ట్రెజరర్ రాముడు, సభ్యులు శర్మ, లక్ష్మణ్, వాసుదేవ మూర్తి, ప్రహ్లద్, జగన్నాథ గుప్తా పాల్గొన్నారు.

ఈసీ ఆదేశానుసారం మార్పులు, చేర్పులు : ఎన్నికల కమిషన్ ఆదేశాలనుసారం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.సిరి తెలిపారు. కలెక్టర్ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... రాజకీయ పార్టీల తరపున బూత్ లెవెల్ ఏజెంట్లు ఉండాలని, వారికి పార్టీ తరపున గుర్తింపు కార్డును ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో కొత్తగా 237 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అవసరమైందని, కొత్తగా ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల వివరాలు విజయవాడ ఎన్నికల అధికారికి పంపాలని ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ మురళీని ఆదేశించారు. డిఆర్ఒ వెంకటనారాయణమ్మ, బీఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జీ అరుణ్ కుమార్, టిడిపి తరపున ఎల్‌వి.ప్రసాద్, జనసేన పార్టీ తరపున తల్లా మంజునాథ్, బిజెపి తరపున పిటి.సాయి ప్రదీప్, కె.వెంకటేశ్వర్లు, ఎన్నిక సెల్ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

యుపి ముఖ్యమంత్రి ఫొటో మార్ఫింగ్

- యువకునిపై వేధింపులు
- ఆరుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో వివాదం చెలరేగింది. యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చిత్రపటాన్ని పంది ఆకారంలో చిత్రీకరించారని వివాదం తలెత్తింది. ఫొటో మార్ఫింగ్ చేసిన యువకుని గుర్తించిన కొందరు దుర్గామాతకు మొక్కించి బొట్టు పెట్టించినట్లు తెలిసింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తనతో దుర్గామాతకు మొక్కించినట్లు పట్టణానికి చెందిన మహ్మద్ కైఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఆదోని పోలీసులు చరణ్ సాయి, శివరాం, ప్రసాద్ మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ

చెత్త సేకరణపై అవగాహన అవసరం : జడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

చెత్త సేకరణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి తెలిపారు. గురువారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో 'స్వచ్ఛత హి సేవ' నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, కల్లూరు ఎంపిడిఒ జి.నాగ శేషాచల రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ నగేష్, ఉలిందకొండ సింగిల్ విండో ఛైర్మన్ ఇవి.రమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సతీష్, నీటి సంఘం అధ్యక్షులు రంగస్వామి రెడ్డి, మహిళా అధ్యక్షులు సత్యనారాయణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్‌పి సిఇఒ మాట్లాడారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామంలో చెత్త సేకరించే గ్రీన్ అంబాసిడర్లను సన్మానించి, మానవహారం వేసి 'స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ' చేశారు. కల్లూరు మండలం నాయకులు వాకిటి మాదేశ్, పెద్దపాడు ధనుంజయ, టిడిపి ఉలిందకొండ నాయకులు, కార్యకర్తలు యుద్ధం శ్రీకాంత్, చాకలి నారాయణ, బొగ్గుల షేక్షావలి, చాకలి వెంకటరమణ, గొల్ల విక్రమ్, షేక్ కలాం, బట్టు సుబ్బరాయుడు, కరీం బాష, చిన్న రాజు పాల్గొన్నారు. **కర్నూలు (హాస్పిటల్)** నగరంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, మార్కెట్ యార్డ్, ఎన్‌టిఆర్ కాలనీల్లో 'స్వచ్ఛతాహి సేవ', సఫాయి సురక్ష శిబిర్' నిర్వహించారు. డిపిఎంఒ డాక్టర్ ఉమా, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, డిపిఒ విజయ రాజు, డాక్టర్ నాగసౌమ్య, డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్'తో పారదర్శక సేవలు

- ఆస్పత్రి ఇన్‌ఛార్జీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

దేశవ్యాప్తంగా ఆరోగ్య సదుపాయాలను ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అత్యంత విప్లవాత్మక పథకమని ఆస్పత్రి ఇన్‌ఛార్జీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు తెలిపారు. గురువారం కర్నూలు మెడికల్ కళాశాల ఆడిటోరియంలో 'ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ నెక్ట్స్ జెన్ ఈ హాస్పిటల్' శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎపిడిఎం ప్రాజెక్టు కోఆర్డినేటర్ కోటిరెడ్డి, రోల్ అవుట్ మేనేజర్ సురేష్, ఈ-హాస్పిటల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శివబాల శిక్షణ ఇచ్చారు. డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ... డిజిటల్ హెల్త్ ఐడి, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, పేషెంట్ డేటా భద్రత, సేవలు వంటి అంశాలపై సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇవ్వడం ద్వారా రోగులు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వేగవంతమైన వైద్యసేవలు పొందుతారని తెలిపారు. కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ... కర్నూలు ప్రభుత్వాస్పత్రి ఎల్లప్పుడూ కొత్త విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ముందుంటుందని తెలిపారు. ఆర్‌ఇహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేష్, స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్, ఈ-హాస్పిటల్ నోడల్ ఆఫీసర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- సెట్కూరు సిఇఒ వేణుగోపాల్

ప్రజాశక్తి - వెల్దుర్తి

డ్రగ్స్ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని సెట్కూరు సిఇఒ వేణుగోపాల్ తెలిపారు. గురువారం జిల్లా యువజన సంక్షేమ శాఖ-సెట్కూరు ఆధ్వర్యంలో వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'మత్తుపదార్థాలు వ్యసనం - పర్యావసానాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సిగరెట్, బీర్ తాగడం అనేది నేటి యువకులు ఒక ఫ్యాషన్‌గా భావిస్తున్నారని తెలిపారు. చిన్న వయస్సులోనే దురలవాట్లు, మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలను కోల్పోతారని చెప్పారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం చెడిపోవడమే కాక బంగారు భవిష్యత్తును చేజేతులారా నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. వారి భవిష్యత్తు కోసం సర్వస్వం ధారబోసిన తల్లిదండ్రులకు దుఃఖాన్ని మిగిలిస్తున్నారని చెప్పారు. వివిధ మాదక పదార్థాలు ఎలాంటి దుష్ఫలితాలను ఇస్తాయో పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. అబ్కారి ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... పరిసరాల్లో మత్తు పదార్థాలను అమ్మడం జరిగినా లేదా రవాణా గురించి తెలిసినా టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ నాగభూషణ్ రెడ్డి మాట్లాడుతూ... యువత చదువుకొనే వయస్సులో దురలవాట్లకు దూరంగా ఉండాలని, అలాగే ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని కోరారు. సెట్కూరు పర్యవేక్షకులు శ్యాం బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సెట్కూరు సిఇఒ వేణుగోపాల్

నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ : జెసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను శుక్రవారం నుంచి చేపట్టనున్నట్లు జెసి డాక్టర్ బి.నవ్య తెలిపారు. గురువారం జెసి తన ఛాంబర్‌లో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా కొత్తగా 4,056 మందికి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ ఉన్నారు.

పత్తి పంట పరిశీలన

ప్రజాశక్తి - పత్తికొండ

మండలంలోని దూదేకొండ, కొత్తిరాళ్ల, కనకదిన్నె గ్రామాల్లో అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పత్తి పంటను గురువారం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాతమ్మ, నంద్యాల శాస్త్రవేత్తలు డాక్టర్ నీలిమ, డాక్టర్ కెవి.రమణమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని 7,052 హెక్టార్లలో పత్తి పంట సాగయిందని, జూన్, జులై నెలల్లో వర్షాలు లేక పంట దెబ్బతినిందని, ఆగస్టు, సెప్టెంబర్‌లో అధిక వర్షాల వల్ల పంట పూర్తిగా దెబ్బతినిందని తెలిపారు. పంట నష్టపరిహారం అందే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీఇచ్చారు. ఎఒ వెంకటరాముడు, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనాథ్, ఆర్‌ఎస్‌కె సిబ్బంది మానస, రాజేశ్వరి, శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత : కమిషనర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగర ప్రజల సమస్యలను పరిష్కరించడానికే తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. గురువారం నగరపాలక కార్యాలయంలో 'డయర్ యువర్ కమిషనర్' నిర్వహించగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుండి 41 ఫిర్యాదులు అందుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ... నగరంలో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారులు, డ్రెయినేజీ కాలువలు వంటి మౌలిక వసతులను నిధుల లభ్యత బట్టి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ప్రత్యామ్నాయంగా డబ్ల్యుబిఎం రహదారుల నిర్మాణానికి కృషి చేస్తామని, అసంపూర్తిగా ఉన్న పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామని, వీలైనంత వరకు పగటిపూట సరఫరా చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మేనేజర్ చిన్నరాము డు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇన్‌ఛార్జీ ఎస్ఇ శేషసాయి, ఎంఇ మనోహర్ రెడ్డి, ఆర్ఒ జునైద్, డిసిపి వెంకట రమణ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాష, మధు పాల్గొన్నారు.

రక్త హీనతతో అనారోగ్య సమస్యలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రక్తహీనతతో మహిళల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ తెలిపారు. గురువారం వడ్డేగేరి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలతో ఎన్‌సిడి 4.0 పురోగతిపై సమీక్ష నిర్వహించారు. వైద్యులు డాక్టర్ వెంకట ప్రవీణ్, కంటి వైద్య నిపుణులు జాహ్నవి, ఆర్‌కెఎస్‌కె కన్సల్టెంట్ మల్లికార్జున, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

శివప్ప నగర్‌లో వసతులు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరపాలక సంస్థ కల్లూరు 35 వ వార్డు శివప్ప నగర్‌లో వసతులు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కే సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు బికే రామకృష్ణ, వార్డ్ కార్యదర్శి బి.పరమేష్, సూర్యనారాయణ, బీరప్ప పర్యటించారు. వారు మాట్లాడుతూ ఈ కాలనీ ఏర్పడి దాదాపు 20 సంవత్సరాలు అవుతోందని, చింతలమని నగర్‌లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ ఎదురుగా ఉన్న శివప్ప నగర్ కాలనీలో అనేక మంది పేద ప్రజలు నివాసం ఉంటున్నారని ఈ కాలనీలో రోడ్లు లేక వర్షం పడిందంటే మొత్తం బురదమయమై ప్రజలు ఇళ్లల్లోకి వెళ్లాలంటే కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని తెలిపారు. దోమలు, పందులకు నిలయంగా మారి ప్రజలు దోమల బారిన పడి అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. వార్డు కార్పొరేటర్ ఎక్కడున్నారో తెలియని పరిస్థితి ఉందన్నారు. సామూహిక మరుగుదొడ్డికి సరఫరా చేసే పైపులైను పగిలిపోయి వారం రోజులు అవుతున్నా, ఆ నీళ్ల లీకేజీ కావడంవల్ల అక్కడ నిల్వ ఉండి బురద గుంత ఏర్పడి మహిళలు మరుగుదొడ్డికి వెళ్లలేని పరిస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. శివప్ప నగర్‌లో సిసి రోడ్లు, మహిళల మరుగుదొడ్డికి నీటి సరఫరా, ఈశ్వరప్ప నగర్‌లో కొత్త మంచినీటి పైపులైన్లు వేయాలని వారు డిమాండ్ చేశారు. కమిషనర్ వెంటనే స్పందించి శివప్ప నగర్‌లో పర్యటన చేయాలని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, లేదంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

కలెక్టర్‌ను అభినందిస్తున్న నాయకులు

కలెక్టర్‌కు ఎన్‌జిఒ నేతల అభినందనలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎ.సిరిని గురువారం ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా పూర్వపు అధ్యక్షులు సిహెచ్.వెంగల్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి, కెసిహెచ్.కృష్ణుడు, కోడుమూరు తాలూకా అధ్యక్షులు శ్రీనివాస యాదవ్, కర్నూలు నగర అధ్యక్ష, కార్యదర్శులు కాశన్న, ఎం.రామకృష్ణ మాట్లాడుతూ... జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ... ఉద్యోగులకు సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆదోని తాలూకా అధ్యక్షులు, కార్యదర్శి ఉషారాణి, బజారి, డోన్ తాలూకా అధ్యక్షులు షమీవుల్లా, కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, నందికొట్కూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, సత్యనారాయణ, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, నాగేశ్వరరావు, బీసీ హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ రాజు, ఫార్మాసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మాసిస్టు దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నగరంలోని ఏ క్యాంప్‌లోని మైపర్ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్, కర్నూల్ రూరల్ ఎస్ఐ జయరాముడు మాట్లాడుతూ... సమాజం పట్ల ఫార్మసిస్టుల బాధ్యతను వివరించారు. మందులపై వాటి వాడకంపై అవగాహన కలిగి ఉండాలని ఫార్మసిస్టులకు సూచించారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్ మాట్లాడుతూ... ఫార్మాసిస్టుల బాధ్యతలు గుర్తుచేస్తూ ఎలా చదవాలి ఎలా చదివితే గొప్ప వ్యక్తులుగా మారతారు అన్న విషయాన్ని విన్నవించారు. కళాశాల విద్యార్థులు వివిధ రకాల షార్ట్ వీడియో ప్రెసెంటేషన్స్, పోస్టర్ ప్రజెంటేషన్, ఫార్మసీ మోడల్స్, యానిమేషన్ వీడియోస్ మొదలైన పోటీలలో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఐక్యుఏసి కోఆర్డినేటర్ భాస్కర్ పాల్గొన్నారు.

మెడికవర్‌లో ఫార్మాసిస్ట్ డే వేడుకలు : మెడికవర్ హాస్పిటల్‌లో ఫార్మాసిస్ట్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ఆసుపత్రి సజావుగా నడవడానికి ఫార్మాసిస్టులు వెన్నెముకలాంటివారని, రోగికి సరయిన ఔషధం, సరైన సలహా ఇవ్వడమే కాకుండా, డ్రగ్ ఇంటరాక్షన్లను నివారించడం, మంచి ఫలితాలు రావడంలో వారు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. వారి నిబద్ధత, సేవలతోనే రోగులు త్వరగా కోలుకుంటారని చెప్పారు. ఫార్మసీ టీమ్ తమ అనుభవాలు, రోజూ ఎదుర్కొనే సవాళ్లను పంచుకున్నారు. హాస్పిటల్ యాజమాన్యం ఫార్మాసిస్ట్‌ల కృషిని అభినందిస్తూ, రోగుల భద్రత కోసం వారు చేస్తున్న నిరంతర సేవలను ప్రశంసించింది.

ఫార్మాసిస్టులను అభినందిస్తున్న మెడికవర్ క్లస్టర్ హెడ్ మహేశ్వర్‌రెడ్డి

నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం అభివృద్ధికి పంపన్న కృషి

- సిపిఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని కల్లుబావి వీధిలో సిపిఎం అభివృద్ధికి సీనియర్ నాయకులు పెద్ద పంపన్న కృషి అభినందనీయమని సిపిఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు తెలిపారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్ పెద్ద పంపన్న 5వ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న మాట్లాడారు. పట్టణంలో కొఠారి మిల్లు కార్మికునిగా కార్మిక సమస్యలపై, నివాస ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేసి, ప్రజలను చైతన్యపరిచే వారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు భవిష్యత్తులో ప్రజా పోరాటాలు నిర్వహించాలని కోరారు. సిపిఎం పట్టణ నాయకులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, వెంకటేష్, అజీమ్ ఖాన్, నాయకులు శ్రీనివాసులు, మల్లయ్య, సీనియర్ జర్నలిస్టు వెంకన్న పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- డిఎల్‌డిఒ బాలకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎల్‌డిఒ బాలకృష్ణారెడ్డి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నూర్జహాన్ అధ్యక్షతన వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన జాగ్రత్తలు, పరిశుభ్రత చర్యలు, ఒడిఎఫ్ గ్రామాల్లో మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, శుభ్రమైన తాగునీటి వాడకాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు. ప్రతి కుటుంబమూ మరుగుదొడ్లను తప్పనిసరిగా వాడేలా చర్యలు తీసుకోవాలని, పిల్లలు, యువత, మహిళల్లో పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు ర్యాలీలు, ప్రచారాలు నిర్వహించాలని తెలిపారు. తహశీల్దార్ కె.రమాదేవి, సర్పంచి భీమయ్య, డాక్టర్ సురేష్, డాక్టర్ సుష్మిత పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒపై డిపిఒ అసహనం

మాట్లాడుతున్న డిపిఒ భాస్కర్

ప్రజాశక్తి - ఆస్పరి

డిప్యూటీ ఎంపిడిఒ విజయ భాను పనితీరుపై డిపిఒ భాస్కర్ అసహనం వ్యక్తం చేశారు. గురువారం 'స్వచ్ఛత హీ సేవా'లో భాగంగా ఆస్పరి బాలుర వసతి గృహం, చెత్త సంపద కేంద్రాల పర్యటించి పరిశుభ్రతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలకు వెళ్లకుండా కార్యాలయంలోనే ఉంటూ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ పద్ధతి మార్చుకోవాలని సూచించారు. శానిటేషన్ తప్పనిసరిగా చేయించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించాలని తెలిపారు. సిబ్బందితో సఖ్యతగా ఉంటూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎఒ స్వర్ణలత, డిప్యూటీ ఎంపిడిఒ విజయభాను, సర్పంచి మూలింటి రాధమ్మ, కెడిసిసి జిల్లా బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, ఏపీవో రామకృష్ణ, సెక్రటరీ విజయ రాజు పాల్గొన్నారు.

వాహనమిత్ర దరఖాస్తు గడువు పొడిగించాలి

ప్రజాశక్తి - దేవనకొండ

ఆటో కార్మికులకు వర్తింపజేసే వాహన మిత్ర దరఖాస్తు గడువు పొడగించాలని, ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.నరసరావు, ఆటో వర్కర్స్ యూనియన్ మండల గౌరవాధ్యక్షులు రాజన్న, మండల నాయకులు ఎ.మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం ఆటో కార్మికులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఎఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, ఆటో కార్మికులు వెంకటేష్, ప్రభుదాస్, చాంద్, రాజు, నరేష్, రవి, తిక్కయ్య, ఉపేంద్ర పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ఉత్తిదే..!

- ఇసుక అక్రమ రవాణా
- ఆదాయ వనరుగా మార్చుకున్న టిడిపి నాయకులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - నందవరం

ప్రజలకు ఉచిత ఇసుక ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఉత్తిదేనని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజలకు ఇసుక అందించడంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజలకు మాత్రం ఇసుక కష్టాలు తప్పడం లేదు. వారి సొంత ఇంటి కల నెరవేర్చుకోవడానికి ఇసుక కొరత, రేట్లు కష్టంగా మారుతున్నాయి. ప్రస్తుతం ప్రజలకు ఒక ట్రాక్టర్ ఇసుక రూ.4,500 వెచ్చించినా దొరకడం లేదు.

ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న ఇసుక

కనీసం రూ.2 వేలకైనా ట్రాక్టర్ ఇసుక లభిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

ఆదాయ వనరుగా మార్చుకున్న టిడిపి నాయకులు

ఇసుక అక్రమ రవాణాను కొంతమంది టిడిపి నాయకులు ఆదాయ వనరులుగా మార్చుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. తుంగభద్ర నదిలో నీరు తగ్గేలోపు వారి వ్యాపారాన్ని మొదలుపెట్టారని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వారి వ్యాపారానికి అడ్డు చెప్పేవారు లేక మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది.

చోద్యం చూస్తున్న అధికారులు

మండలంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. రోజూ సుమారు 20 నుంచి 30 ట్రాక్టర్ల వరకు ఇసుక రవాణా జరుగుతోంది. అక్రమ ఇసుకను రవాణా చేయ డానికి నాగలదిన్నె నుంచి కనకవీడు మార్గాన్ని అక్రమార్కులు ఎంపిక చేసుకున్నారు. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు, కళ్లముందే ట్రాక్టర్లు వెళ్లినా చూడనట్లు చోద్యం చూస్తున్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న నాయకులు

ఎంపిపిపై అవిశ్వాసం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు నోటీసు అందజేత

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఎంపిపి బడాయి దానమ్మపై అవిశ్వాసం పెడుతున్నామని, అందుకు ఏర్పాట్లు చేయాలని వైసిపి ఎంపిటిసిలు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కోరారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం చేరుకున్న ఎంపిటిసిలు ఆధార్, ఐడి కార్డులు సంతకాలతో కూడిన నోటీసును సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు అందజేశారు. నోటీసును పరిశీలించి కలెక్టర్‌కు పంపుతామని, తదుపరి ప్రక్రియ తెలియజేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు చంద్రకాంత్ రెడ్డి, గురునాథరెడ్డి, ఎంపిటిసి శివకుమార్ మాట్లాడారు. ఆదోని మండలం కపటి ఎంపిటిసిగా వైసిపి తరపున గెలిచిన బడాయి దానమ్మను ఎంపిపిగా ఎన్నుకున్నారని తెలిపారు. ఎంపిటిసిల అభివృద్ధిని గాలికొదిలి స్వప్రయోజనాల కోసం ఆమె ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బిజెపిలో చేరారన్నారు. అధికార పార్టీలో చేరితే పనులు జరుగుతాయని కుంటి సాకులు చూపి దానమ్మ పార్టీ మారి 18 నెలలు గడిచిందని, ఎక్కడ అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీశారు. పార్టీ ఫిరాయించిన దానమ్మ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఎంపిటిసిలు మొదటి నుంచి చెబుతూనే ఉన్నారని తెలిపారు. పదవి చేపట్టి నాలుగేళ్లు గడిచిందని, ఎన్నికల నిబంధనల మేరకు ఆమెపై అవిశ్వాసం పెట్టేందుకు ఇప్పుడు అవకాశం వచ్చిందని చెప్పారు. మండలంలో 26 మంది ఎంపిటిసిలకు గాను ఇద్దరు టిడిపి, మరో ఇద్దరు మరణించారని తెలిపారు. దానమ్మ బిజెపిలో చేరగా ఆరెకల్ ఎంపిటిసి రాజీనామా చేయగా వైసిపికి 20 మంది ఎంపిటిసిలు ఉన్నారన్నారు. అందరి వివరాలు సేకరించిన సబ్ కలెక్టర్ త్వరలోనే అవిశ్వాస ప్రక్రియ చేపడతామని తెలిపారు. ఎంపిటిసిలు శివకుమార్, నరేందర్ రెడ్డి, ఈరన్న ఉన్నారు.

వీధి వ్యాపారులకు విరివిగా రుణాలు

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

వ్యాపారం విస్తరించుకునేలా వీధి వ్యాపారులకు విరివిగా బ్యాంకుల ద్వారా రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మెప్మా పీడీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆదోని మెప్మా కార్యాలయంలో సిఎంఎం వీరారెడ్డి అధ్యక్షతన 'పిఎం స్వానిధి లోక కల్యాణం పథకం' గురించి బ్యాంకు మేనేజర్ల సమక్షంలో చిరు వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిరు, వీధి వ్యాపారుల ఆర్థిక బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి, పిఎం స్వానిధి పథకంలో భాగంగా లోక్ కల్యాణ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చున్నారు. పట్టణ ప్రాంతాల్లో చిరు వ్యాపారులకు కేంద్రం 'లోక్ కల్యాణ్ మేళా' పేరిట నేటి నుంచి రుణాల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో నేరుగా క్రెడిట్ కార్డులూ ఇస్తారన్నారు. అర్హత ఉన్న వారికి రుణం మంజూరు చేసి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. బ్యాంకు మేనేజర్లు, మెప్మా టిఇఎల్‌హెచ్ జిలాన్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు జావీద్, కృష్ణవేణి, పుల్లయ్య, అరుణ, నారాయణమ్మ ఉన్నారు.

రుణం మంజూరు పత్రాలు అందజేస్తున్న అధికారులు

అట్రాసిటీ కేసు నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వొద్దు

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వరాదని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవ సహాయం కోరారు. గురువారం విజయవాడలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులతో జరిగిన ధర్నాకు దేవసహాయం మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని నీరు గార్చకుండా పటిష్టంగా అమలు చేయాలని కోరారు. రాజకీయ నాయకుల జోక్యంతో కేసులు కట్టడం, ఫాల్స్ చేయడం, రాజీ వంటి చర్యల వల్ల నీరుగారి నిజమైన బాధితులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు.

బాధితులకు సంఘీభావం తెలుపుతున్న దేవ సహాయం

సన్మానాలు కాదు.. కార్మికుల కడుపులు నింపండి

- సిఐటియు మండల నాయకులు జయరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

కార్మిక చట్టాలకు తూట్లు పొడిచి నేడు కన్నీరు తుడిచే ప్రయత్నంతో సన్మానాలు చేస్తున్నారని, సన్మానాలు వద్దు.. కడుపులు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సిఐటియు మండల నాయకులు హెచ్.జయరాజు కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. 'స్వచ్ఛత హీ సేవా'లో భాగంగా ఎంపిడిఒ నూర్జహాన్, సర్పంచి భీమయ్య, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జి బి.వరదరాజులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించడం సంతోషకరమని తెలిపారు. కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్న వారికి సన్మానించే హక్కు లేదన్నారు. మురుగు కాలువలు, డ్రెయినేజీలను, చెత్తాచెదారాన్ని శుభ్రం చేసి.. రోగాల బారిన పడుతున్న కార్మికులపై మానవత్వం చూపాలని తెలిపారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న కార్మికులకు జీతాలు పెంచడంతో పాటు సిబ్బందిని పెంచి పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఒక్కరోజు పారిశుధ్య కార్మికుల్లా పనులు చేస్తే వారి గొప్పతనం తెలుస్తుందని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పనికి తగిన పారితోషికమిచ్చి గౌరవించాలని కోరారు.

బేడలు, సగ్గు బియ్యంతో అలంకరణ

ప్రజాశక్తి - ఆదోని రూరల్

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వకు గురువారం మైసూర్ బేడలు, సగ్గుబియ్యంతో అలంకరించారు. ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త రాయచోటి రామయ్య కోరారు.

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి - సి బెళగల్

జిఎస్‌టి తగ్గింపుపై కమర్షియల్ విభాగపు జిల్లా అధికారులు మురళీ, సుబ్బారెడ్డి గురువారం మండల అధికారులకు అవగాహన కల్పించారు. ఎంపిడిఒ రాణెమ్మ, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆయా అధికారులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... మధ్య తరగతి కుటుంబాలకు అన్ని కొనుగోళ్లపైనా అందుబాటులో ఉండేలా ఈ కొత్త జిఎస్‌టి విధానం అమలులోకి వచ్చిందని తెలిపారు. స్వదేశీ ఉత్పత్తుల యాజమాన్యం, దేశ అభివృద్ధిలో నేరుగా భాగస్వామ్యం కావాలన్న కాంక్ష అని పేర్కొన్నారు.

ఉపాధి కూలీ కుటుంబానికి బీమా పరిహారం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నందవరం మండలం జొహరాపురం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ అలుకూరు రామిరెడ్డి ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు ద్వారా రూ.లక్ష బీమా పరిహారాన్ని కుటుంబ సభ్యులకు గురువారం డ్వామా పీడీ వెంకటరమణయ్య అందజేశారు. వేణు, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ కర్నూలు జిల్లా మేనేజర్ బి.వీరా రెడ్డి, కస్టమర్ గ్రీవెన్స్ మేనేజర్ షేక్ మహబూబ్ బాషా, ప్రమోటర్ రామచంద్ర, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'పేట' వైపు కదిలిన అధికారులు, నాయకులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన - రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణం
- టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ - పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి - డిప్యూటీ ఎంపిడిఒ సందీప్

ప్రజాశక్తి - నందవరం

ప్రజాశక్తి కథనంతో రాజకీయ, అధికార యంత్రాంగం పేట గ్రామం వైపు కదిలింది. గురువారం ప్రజాశక్తి ప్రచురితమైన 'సమస్యల వలయంగా 'పేట' వార్తకు రాజకీయ నాయకులు, అధికారులు స్పందించారు. గురువారం పేట గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఉన్న దుర్భర స్థితిని వాడవాడలా తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ మాట్లాడారు. గ్రామంలో ఉన్న డ్రెయినేజీ, రోడ్ల సమస్యను ఎన్నికల సమయంలోనే గుర్తించామని, అప్పటికే గ్రామం దుర్భరమైన స్థితిలో ఉందని తెలిపారు. కూటమి ఏర్పడిన వెంటనే రూ.20 లక్షలతో వీధుల్లో రోడ్డు నిర్మాణం చేపట్టామని, గుంతలమయంగా ఉన్న ప్రధాన రహదారి ఆర్‌అండ్‌బికి సంబంధించిందని, అందుకే కొంత కాలయాపన

నీరు ఆగిన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

జరిగిందని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు విడుదలయినట్లు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారన్నారు. త్వరగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ : డిప్యూటీ ఎంపిడిఒ సందీప్

రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాన్ని త్వరలో చేపడతామని, అప్పటివరకు గ్రామ పారిశుధ్యంపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ ఎంపిడిఒ సందీప్ తెలిపారు. రోజూ గ్రామాన్ని శుభ్రం చేస్తూ చెత్తాచెదారాన్ని తొలగించాలని, బ్లీచింగ్ చల్లుతూ ఉండాలని చెప్పారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, ప్రజలు రోగాల బారిన పడకుండా సంరక్షించాలని తెలిపారు. ఎఒ కృష్ణమూర్తి, నాయకులు ఉదయ్ గౌడ్, డబ్బా ఈరన్న, రామకృష్ణారెడ్డి, సత్యరెడ్డి, మాబు హుస్సేని, శ్యామల్లి, మాబాష, ఈరన్న పాల్గొన్నారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- ఎంపిడిఒ నూర్జహాన్, సర్పంచి భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం

పంచాయతీ కార్మికుల సేవలు వెలకట్ట లేనివని ఎంపిడిఒ నూర్జహాన్, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య కొనియాడారు. గురువారం 'స్వచ్ఛత హీ సేవా'లో భాగంగా ఎంపిడిఒ నూర్జహాన్, తహశీల్దార్ కె.రమాదేవి, ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపిడిఒ ఉపేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వారి విధులు కష్టతరమని, ఎక్కడైనా అపరిశుభ్రత ఉంటే కొద్ది సేపు కూడా నిలవలేమని తెలిపారు. వారు ఎప్పుడూ చెడు వాసనను తట్టుకుని, జబ్బులకు లోనై వీధులను శుభ్రం చేస్తారని కొనియాడారు. అనంతరం కార్మికులను గ్రామంలో ఊరేగించారు. టిడిపి పట్టణ ఇన్‌ఛార్జి బి.వరదరాజులు, ఎంపిటిసి మేకల వెంకటేష్, టిడిపి నాయకులు రఘు, శివ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరాముడు, విఆర్‌ఒ అల్లాబకాష్ పాల్గొన్నారు.

కార్మికులను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

గ్రావెల్ చల్లుతున్న అధికారులు, నాయకులు

కమిషనర్ శ్రమదానం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ ఆవరణలో గురువారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. 'స్వచ్ఛత హి సేవ'లో భాగంగా మైదానంలో పడిన గుంతలను గ్రావెల్‌తో పూడ్చి చదును చేశారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, టిడిపి పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, విట్టా రమేష్, హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్ ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు జరిమానా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆదోని సబ్ రిజిస్ట్రార్ ఆర్.రాజశేఖర్‌కు రూ.20.26 లక్షల జరిమానా విధిస్తూ ఉప లోకాయుక్త పి.రజిని గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఆదోనికి చెందిన రామకృష్ణ ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణ చేపట్టింది. అప్పటి ఆదోని సబ్ రిజిస్ట్రార్ రాజశేఖర్ సరయిన స్టాంప్ డ్యూటీ విలువ స్వీకరించకుండా తక్కువ స్టాంపు డ్యూటీకి డాక్యుమెంట్ నెంబరు 5352/2023ని నమోదు (రిజిస్ట్రేషన్) చేయడం ద్వారా అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదుదారుడు లోకాయుక్త దృష్టికి తెచ్చారు. భారతీయ స్టాంపుల చట్టంలోని సెక్షన్ 27లోని నిబంధనల ప్రకారం రాష్ట్ర ఖజానాకు రూ.20,26,200 ఆర్థిక నష్టం వాటిల్లిందని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు. ఆదోని సబ్ రిజిస్ట్రార్ ఆర్.రాజశేఖర్ దస్తావేజు నెంబరు 5352/2023ను సరయిన స్టాంపు డ్యూటీ లేకుండా రిజిస్ట్రేషన్ చేసినట్లు రుజువు కావడంతో సదరు లోటు స్టాంప్ డ్యూటీ సొమ్ము రూ.20,26,200ను సంబంధిత పార్టీల నుంచి వసూలు చేయాలని ఆదేశించింది. సబ్ రిజిస్ట్రార్ ఆర్.రాజశేఖర్‌పై క్రమశిక్షణ చర్యల కింద 1991 ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ సిసిఎ నియమాల ప్రకారం మూడేళ్ల పాటు ఇంక్రిమెంట్‌ను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'ప్రతి శ్రామికునీ అప్‌లోడ్ చేయాలి'

ప్రజాశక్తి- దేవనకొండ

ఉపాధి హామీ చట్టం కింద ప్రతి శ్రామికునీ ఈకేవైసీ పూర్తి చేసి ఫేస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపిడిఒ జ్యోతి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హార్టికల్చర్ కింద పండ్ల మొక్కలను రైతులతో నాటించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసి పెండింగ్ లేకుండా చూడాలని చెప్పారు. కోర్స్ డైరెక్టర్ సురేష్, ఏపీవో రాజునాయక్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ జ్యోతి

పొలం రస్తా సమస్య పరిష్కారం


రైతులతో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి - సి బెళగల్

గొల్లలదొడ్డిలో పొలం రస్తా వివాదం ముదరడంతో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, రాజకీయ నాయకులు కొత్తకోట ప్రకాష్ రెడ్డి గురువారం సమస్యలను పరిష్కరించారు. రైతులు రాఘవేంద్ర, పక్కీరన్న, రామలక్ష్మి, మరి కొంతమంది రైతుల మధ్య పొలాలకు వెళ్లేందుకు ఏళ్లుగా రస్తా విషయంలో వివాదం నడుస్తోంది. అధికారులు, పోలీసులు పరిష్కారం చూపినా సమస్య మళ్లీ మొదటికి వస్తుండడంతో తలనొప్పిగా మారింది. పెద్దల దగ్గరకు పంచాయితీ వెళ్లడంతో సామరస్యంగా పరిష్కరించుకొని ఒప్పంద పత్రం రాసుకున్నారు.

ప్రజల భద్రత కోసం బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

- ఎస్ఐ విజయ్ కుమార్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజల భద్రత కోసం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టినట్లు ఇన్‌ఛార్జీ ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం శ్రీరాఘవేంద్రస్వామిలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ తుంగభద్ర నదీతీరంతో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలైన బస్టాండ్, తుంగభద్ర రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో బాంబు, డాగ్ స్క్వాడ్ టీములు, పోలీసు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... అనుమానిత వ్యక్తులు, అనుమానిత వస్తువులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్రజలు, భక్తులు అనుమానిత వ్యక్తుల పట్ల, అనుమానిత వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాంబు స్క్వాడ్ సిబ్బంది శేఖర్, ఈదన్న, చంద్రశేఖర్, డాగ్ స్క్వాడ్ అధికారి వేణుగోపాల్, హెడ్ కానిస్టేబుళ్లు ఎంవి.రమణ, మల్లికార్జున స్వామి, పోలీసు సిబ్బంది భాస్కర్, పరమేష్, సోమశేఖర్ పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సుజాత

గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలు

- ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త సుజాత

ప్రజాశక్తి - దేవనకొండ

పత్తి పంటను ఆశించే గులాబీ రంగు పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త సుజాత, ఎఒ ఉషారాణి సూచించారు. గురువారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో రైతు నాగన్న పొలంలో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడారు. అధిక వర్షాలకు పత్తి పంట ఆకులు ఎర్రగా అయిందని, నివారణకు పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటర్ నీటిలో కలిపి వారానికోసారి పిచికారి చేయాలని తెలిపారు. పత్తి పంటలో ఎకరాకు 8 నుంచి 10 లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలని చెప్పారు. గులాబీ రంగు పురుగు నివారణకు సైపర్ మిత్రిన్ 2 మిల్లీలీటర్లు నీటిలో కలుపుకొని పిచికారి చేయాలన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ఫోటో : ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. గురువారం స్వామివారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిధ్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. వివిధ రథోత్సవ సేవలు చేయించిన భక్తులతో సంకల్పం చేయించారు. గజానోత్సవం, వెండి కొయ్య, స్వర్ణ నవరత్న, స్వర్ణ రథోత్సవంపై ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులను ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్‌ఒ హొన్నాళి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా పకీర్ తాత శంషార్ ఊరేగింపు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో పకీర్ తాత 31వ ఉరుసు మహోత్సవం సందర్భంగా గురువారం పకీర్ తాత ప్రతిమను గుర్రంపై ఉంచి గ్రామంలోని పురవీధుల గూండా శంషార్ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అడుగడుగునా పూజలు నిర్వహించి, చదివింపులు చేపట్టారు. పకీర్ తాత సమాధి నుంచి, కత్రిమాల మునయ్య ఇంటి వరకు ఊరేగింపు నిర్వహించారు. చిప్పగిరిలో వెలిసిన శ్రీసయ్యద్ అహ్మద్ వలీసా ఖాద్రియ చిస్తీయా మహోత్సవం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఉరుసును తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. భక్తులు, గ్రామస్తులకు భోజన వసతి, తాగునీటి సౌకర్యం కల్పించారు.

ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామపెద్దలు

IN THE COURT OF THE PRL.JR.CIVIL JUDGE : KURNOOL
O.S.NO.1556/2022

C.Vijaykumar. ...Plaintiff
-Vs-
C.Ashok and anothers. ...Defendats

1వ ప్రతివాదికి దావా సమన్లు

సి.అశోక్ తండ్రి సాధు,
ఇంటి నెం.41-639, కొత్తపేట, కర్నూలు.

పై నెంబర్‌లో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ॥1,68,000.00 లు ముందు వడ్డి, కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినారు. ఇందులో 1వ ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 13.10.2025 తేదిన పగలు 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల నీపరోక్షమున విచారించి తీర్మానించబడను.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

పి. జగదీష్ బాబు,
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.

IN THE COURT OF THE PRL.JR.CIVIL JUDGE : KURNOOL
E.P.NO.32/2024 IN O.S.NO.896/2022

E.Krishna Teja ...D.Hr
-Vs-
P.Krishna S/o Late P.Shalanna
Mesthri in Kurnool Municipal Corrporation,
Govt Employee, H.No.36-299-A,
Chittari Street, Kurnool. ...J.Dr

O-21, R-48 ప్రకారం J.Dr కు నోటీసులు

పై నెంబర్ దావాలో వాది ప్రతివాది పైన పొందిన డిక్రిని అమలు జరపుచు J.Dr తాలుకు జీతమును జప్తికోరి E.P. దాఖలు చేసినాడు. ఇందులో J.Dr అయిన నీకు ఆక్షేపణ ఉన్న 30-10-2025 తేదని పగలు 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

జె.లక్ష్మినారాయణ,
J.Dr పరం అడ్వకేటు,
కర్నూలు.

ఆన్‌లైన్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

- రిజిస్ట్రార్ శ్రీనివాస్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులకు ఏడాది పాటు ఉచితంగా ఆన్‌లైన్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ జి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీ కర్నూలు, ఎక్స్‌ఎల్‌ఆర్ ఎడ్యుటెక్ ప్రయివేట్ లిమిటెడ్‌తో కలిసి 'ఎవ్రీ డే లెర్నింగ్'ను ప్రారంభించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 30కిపైగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల్లో సర్టిఫికేట్లు కూడా లభిస్తాయని తెలిపారు. యూనివర్సిటీ అధ్యాపకులకు ఉచిత ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ద్వారా బోధన, పరిశోధన రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎక్స్‌ఎల్‌ఆర్ ఎడ్యుటెక్ వ్యవస్థాపకులు, సిఇఒ శ్రీరామ్ టవ్వా మాట్లాడుతూ... విద్యార్థులు ఉద్యోగావకాశాల కోసం అవసరమైన నైపుణ్యాలు పొందుతారన్నారు. ఎంఒయుపై క్లస్టర్ యూనివర్సిటీ తరపున రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్, శ్రీరామ్ టవ్వా, సహ వ్యవస్థాపకులు, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సంతకాలు చేశారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్స్ మహ్మద్ వాయిజ్ (అకాడమిక్స్), డాక్టర్ కె.నాగరాజ్ శెట్టి (పరీక్షలు), డాక్టర్ అక్తర్ భాను (ప్రశాసన), ఒఎస్‌డి మహబూబ్ బాషా పాల్గొన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం చేసుకుంటున్న ఎక్స్‌ఎల్‌ఆర్ ఎడిటెక్ సంస్థ ప్రతినిధులు

ఆర్‌యు కళాశాల కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ

క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న వెంకట బసవరాజు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఈ నెల 26, 27వ తేదీల్లో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగే అంతర్ కళాశాల పోటీల్లో పాల్గొనే ఆర్‌యు కళాశాల కబడ్డీ జట్టుకు ఉపకులపతి ప్రొఫెసర్ వెంకట బసవరాజు గురువారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ రెక్టారు ప్రొఫెసర్ ఎన్‌టికె.నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ ఫ్రొఫెస్సర్ సివి.కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ కెవి.శివ కిషోర్ పాల్గొన్నారు.

కాటసానిని కలిసిన రమణా రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని వైఎస్‌ఆర్‌టియుసి అధికార ప్రతినిధి కెవి.రమణారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సన్మానించారు. అనంతరం వారితో మాట్లాడుతూ... పార్టీలో కష్టపడే కార్యకర్తలకు పదవులు వస్తాయని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. 26వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీ కాంత్ రెడ్డి, బస్తిపాడు రమణారెడ్డి, పందిపాడు శివశంకర్ రెడ్డి, పుసులూరు రామకృష్ణారెడ్డి, బొల్లవరం చాంద్ బాషా, సాయి పాల్గొన్నారు.

కాటసాని రాంభూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న రమణారెడ్డి

శ్రీవారి ఆలయాన్ని దోచుకున్న 420.. జగన్

- మాదిగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ధరూరు జేమ్స్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి ఆలయాన్ని దోచుకున్న 420.. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్ విమర్శించారు. గురువారం ఆయన టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దోచుకోవడానికి కాదేది అతీతం అన్నట్లుగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తీరు ఉందన్నారు. దేశంలో ఎన్నడూ లేనివిధంగా 'క్విడ్ ప్రో కో' లాంటి వినూత్న పద్ధతిలో జగన్ అవినీతికి పాల్పడి దోచుకున్న సొమ్మును విదేశాలకు తరలించారని, పెట్టుబడులుగా మార్చి మనీ లాండరింగ్‌కు పాల్పడిన ఘరానా దొంగ అని మండిపడ్డారు. తండ్రి అక్రమాస్తులకు సంబంధించి సిబిఐ కేసుల్లో 16 నెలల పాటు చెంచల్‌గూడా జైలులో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి భూమన కరుణాకర్ రెడ్డిని టిటిడి ఛైర్మన్‌గా నియమించి శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని దోచుకోవడానికి అడ్డాగా మార్చుకున్నారని విమర్శించారు. శ్రీవారి దర్శనానికి వెళ్లిన జగన్ మోహన్ రెడ్డి డిక్లరేషన్ సమర్పించకపోవడం ఆయన అహంభావానికి నిదర్శనమని తెలిపారు. 2014లో టిడిపి అధికారంలో ఉన్న నాడు శ్రీవారి ఆభరణాల్లోని 'బ్లూ డైమండ్' అపహరణకు గురైందని తప్పుడు ప్రచారం చేసిన జగన్ తాను అధికారంలో ఉన్న సమయంలో ఎందుకు విచారణ జరపలేదో చెప్పాలని ప్రశ్నించారు. కేవలం టిడిపిపై బురద జల్లేందుకు చేసిన కేవలం కుట్ర మాత్రమేనని తేలిపోయిందన్నారు. భక్తుల దర్శనార్థం ముద్రించిన టికెట్లను కూడా వైసిపి నాయకులు వ్యాపారంగా మార్చుకున్నారన్నారు. గత చరిత్రకు భిన్నంగా శ్రీవారికి సమర్పించిన ఆభరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం తాకట్టుపెట్టారని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై వైసిపి అసత్య ప్రచారాన్ని మానుకోవాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ధరూరు జేమ్స్

మాట్లాడుతున్న నాయకులు

బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ ఏర్పాటును విరమించుకోవాలి

- జాతీయ మత్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద నిర్మించ తలపెట్టిన బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని విరమించుకొవాలని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు కోరారు. గురువారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న జాతీయ మత్యకారుల సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఆ ప్రాంతంలో నిర్మించిన హెట్రో పరిశ్రమలోని కాలుష్యం సముద్రంలోకి ఇంకడం వల్ల మత్స్యకారులు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. రాజయ్యపేట పరిసర ప్రాంతంలో నిర్మిస్తున్న బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీ వల్ల మత్స్యకాలకు తీవ్ర నష్టం కలుగుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపేయాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిపియుఎస్‌ఐ పార్టీ జాతీయ కార్యదర్శి పగడాల కోదండ, నాయకులు హరీష్, ప్రింటింగ్ రఘు, శ్రీనివాసులు, గోవిందరాజులు పాల్గొన్నారు.

28న జాతీయ కవయిత్రుల సమ్మేళనం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ఈనెల 28న కర్నూలులో 8వ జాతీయ కవయిత్రుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, గణేష్ సాహితీ సంస్థ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్తా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. కర్నూలులో గణేష్ సాహితీ సదన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఉత్సాహం ఉన్న కవయిత్రులు పాల్గొనవచ్చని కోరారు. ఈ సమ్మేళనంలో పాల్గొనే వారు 9440228999 వాట్సాప్ నెంబర్‌కు ఈనెల 26లోపు పేరు నమోదు చేసుకోవాలని కోరారు. గణేష్ సాహితీ సదన్, గుత్తి పెట్రోల్ బంక్ రోడ్డు, మిస్టర్ ఇడ్లీ లైన్, ఆర్‌టిసి కాలనీ కర్నూలులో నిర్వహిస్తున్నామని తెలిపారు.

వరంగల్ కాళోజిలో సామా నాటక ప్రదర్శన

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

నంది అవార్డు గ్రహీత శ్రీకృష్ణ పాత్రధారి పందిళ్ల శేఖర్ బాబు వర్ధంతి సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో వరంగల్ కాళోజి కళాక్షేత్రంలో గురువారం కర్నూలు టిజివి కళాక్షేత్రానికి చెందిన జగదేక సుందరి సామా నాటక ప్రదర్శన జరిగింది. టిజివి కళాక్షేత్రం కళాకారులు పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, బిఎం.రెడ్డి, సదానంద హాజరయి కళాకారులను సన్మానించారు.